క్లుప్తంగా

వితరణ..



హెచ్‌ఎంకు వాటర్ ప్యూరిఫైర్‌ను అందజేస్తున్న డాక్టర్ నందిని

జలుమూరు: దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలు మరింత అభివృద్ధి చెందుతాయని శ్రీముఖలింగం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సి.హెచ్.సత్యనారాయణ అన్నారు. గురువారం అదే గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థిని డాక్టర్ బసవ నందిని పాఠశాలకు అవసరమ్యే వాటర్ ప్యూరిఫైర్ అందించారు. నందిని మాట్లాడుతూ ఇదే పాఠశాలలో చదివి తనవంతు సహాయం చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలు ధరించాలి



మాట్లాడుతున్న జగదీశ్వర్

ఆమదాలవలస: చేనేత వస్త్రాలు ప్రతి ఒక్కరూ ధరించాలని, శరీరానికి సంరక్షిస్తాయని జిల్లా ఆప్కో హ్యాండ్లూమ్ డివిజన్ మానటరింగ్ అధికారి తూతిక జగదీశ్వర్ అన్నారు. ఆమదాలవలస పట్టణంలో అరుణోదయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన చేనేత దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మనం ధరించే వస్త్రాల ద్వారా మనకు ప్రతిష్ట, గౌరవం పెరుగుతుందన్నారు. సంస్థ అధ్యక్షుడు అరుణ్ కుమార్, వీవర్స్ విశ్రాంత ఉద్యోగి దిలీప్ కుమార్, పట్టణ మహిళలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపిక



విద్యార్థినులతో ప్రిన్సిపాల్, పీఈటీ

పొందూరు: మండలంలోని లోలుగు కేజీబీవీ పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఎం.ద్రాక్ష, డి.హాసిని రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైనట్లు గురువారం ప్రిన్సిపాల్ రేజేటి సౌమ్య, వ్యాయామ ఉపాధ్యాయిరాలు ఎం.రూపవతి తెలిపారు. అండర్–18 విభాగంలో ద్రాక్ష, అండర్–16 విభాగంలో హాసిని ఈ పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు చీరాలలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు.

265 మందికి నేత్ర పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న జానకిరామయ్య

కొత్తూరు: మండలంలోని లబ్బ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 265 మంది విద్యార్థులకు గురువారం కొత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి ఆప్తాలమిక్ ఆఫీసర్ ఇప్పిలి జానకిరామయ్య కంటి పరీక్షలు నిర్వహించారు. నలుగురు విద్యార్థులకు దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ద్వారా కళ్లద్దాలు అందిస్తామన్నారు. హెచ్‌ఎం కాశీవిశ్వనాథం, వైద్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

6-ఏ కేసు పెట్టడం అన్యాయం



ధనలక్ష్మిని పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్, నాయకులు

ఆమదాలవలస: మండలంలోని మునగవలస గ్రామానికి చెందిన రేషన్ డీలర్ ఎం.ధనలక్ష్మిపై కూటమి ప్రభుత్వం కక్ష కట్టి 6-ఏ కేసు పెట్టి విధుల నుంచి తొలగించడం అన్యాయమని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. అన్యాయంగా కేసు పెట్టడంతో ఆమె మనస్థాపానికి గురై ఇటీవల ఆత్మహత్యాయత్నం చేశారన్నారు. శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆమెను గురువారం పరామర్శించి, పార్టీ తరఫున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. ఆమదాలవలస వెంగళరావు కాలనీకి చెందిన పార్టీ నాయకుడు బొడ్డేపల్లి రవికుమార్ ఇటీవల జరిగిన ప్రమాదంలో కాలుకు గాయాలై చికిత్స పొందుతుండగా ఆయనను పరామర్శించారు.

సాగునీరు అందించండి
మహా ప్రభో..!



పెద్దపాలెం వద్ద ఎండిపోయిన వరి పొలం

- 1,300 ఎకరాల్లో ఎండిపోతున్న వరి పంట
- ప్రత్యామ్నాయ చర్యలు శూన్యం
- సాగునీటి కోసం రోడ్డెక్కనున్న రైతులు
- కార్యాలయాల ముట్టడికి అన్నదాతల సిద్ధం
- పట్టించుకోని అధికారులు



కొండవలస వద్ద గిడసబారుతున్న వరి పంట



డకరవలస ఎత్తిపోతల పథకం ఇన్‌లెట్ ట్యాంక్‌లో పేరుకుపోయిన పూడిక

సరుబుజ్జిలి: రైతుల పంట పొలాలకు సాగునీటిని అందించడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందని చెప్పవచ్చు. దీనివలన చుక్కనీటి కోసం అన్నదాతలు నానా అవస్థలు పడుతున్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలో 24,367 హెక్టార్లలో రైతులు ఖరీఫ్‌కు సంబంధించి సాగు చేస్తున్నారు.

అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని..

సరుబుజ్జిలి మండలంలో సాగునీరు అందించేందుకు అన్నిరకాల వనరులు ఉన్నా.. వాటిని సద్వినియోగం చేయడంలో అధికార యంత్రాంగం శ్రద్ధ చూపడం లేదు. డకరవలస వద్ద 800 ఎకరాల ఆయకట్టుకు నీరందించాల్సిన ఎత్తిపోతల పథకం పూర్తిగా పడకేసింది. వంశధారకుడి ప్రధాన కాలువతోపాటు, 14 పిల్ల కాలువలు, ఓపెన్‌హెడ్ చానల్, రెండు మినీ రిజర్వాయర్లు ఉన్నప్పటికీ సాగునీరు అందించడంలో ఆశించిన ప్రగతి కనిపించడంలేదు.

మాడిపోతున్న వరి పంట..

సకాలంలో సాగునీటిని విడుదల చేయకపోవడం వలన ఎండ ధాటికి వరి పంట మాడిపోయింది. కొండవలస, పాలవలస, పెద్దపాలెం, చిన్నపాలెం, డకరవలస, సుభద్రాపురం, చిగురువలస, తాడికొండ, కొండ్రగూడ, వెన్నెలవలస గ్రామాల్లో గల దాదాపు 1,300 ఎకరాల పంట భూమి ఎండిపోయే స్థితిలో ఉందని రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ముందస్తు ప్రణాళికలు కరవు..

రైతులకు సాగునీటిని అందించడంలో అధికార యంత్రాంగం ముందస్తు ప్రణాళికలు చేయలేదు. కొత్తకోట, వెన్నెలవలస మినీ రిజర్వాయర్ల ద్వారా 400 ఎకరాలకు సాగునీరు అందాలి. కొత్తకోట మినీ రిజర్వాయర్‌లో అరకొరగా పనులు చేయడంతో మరలా గుర్రపుడెక్క భారీగా పేరుకుపోయింది. డకరవలస ఎత్తిపోతల పథకం ద్వారా 800 ఎకరాలకు సాగునీటిని అందించాలి. వీటి మోటార్లు పనిచేయక నెలరోజులు కావస్తున్నా ఇంతవరకు మరమ్మతులు చేయలేదు.

ఆందోళన బాటపట్టనున్న అన్నదాత..

సాగునీటిని అందించడంలో అధికారులు విఫలం కావడంతో అన్నదాతలు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. వంశధార, నీటిపారుదల కార్యాలయాల ముందు రైతు సంఘాల నేతల ఆధ్వర్యంలో ధర్నాలు, నిరసనలు తెలిపేందుకు సిద్ధవుతున్నారు.

ఆమదాలవలస నియోజకవర్గంలోని సాగు వివరాలు (హెక్టార్లు) ఇలా..				
మండలం	సరుబుజ్జిలి	బూర్జ	పొందూరు	ఆమదాలవలస
ఆయకట్టు	5,201	6,109	6,823	6,234

నీటికోసం కోటి కష్టాలు



చుక్క సాగునీటి కోసం రైతులందరూ కోటి కష్టాలు పడుతున్నాం. సాగునీటి వ్యవహారంలో కూడా అధికారులు రాజకీయాలు చేస్తున్నారు. దీనివలన లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టిన రైతులంతా నష్టపోయే ప్రమాదముంది. ఉన్నతాధికారులు దృష్టి సారించాలి.

– లావేటి బాబూరావు, రైతు, కొండవలస, సరుబుజ్జిలి మండలం

పర్యవేక్షణ కరువు



ఖరీఫ్ సీజన్‌కు ముందుగా అధికారుల క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయడం లేదు. దీనివలన అక్కడి కాలువలు, ప్రాజెక్ట్‌ల పరిస్థితి వారికి అర్థం కావడంలేదు. ఆదరాబాదరగా కూటమి కార్యకర్తల మేలు కోసం పనులు చేస్తున్నారే తప్ప.. రైతుకు ప్రయోజనం లేదు.

– పి.వెంకటేష్, రైతు, మూలసవలాపురం, సరుబుజ్జిలి మండలం

ప్రణాళికలు సిద్ధం చేశాం

రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా అందించే ప్రణాళికలు సిద్ధం చేశాం. ఇటీవల చేపట్టిన పనుల వలన ఇబ్బందులు ఉంటే మరలా పనులు చేస్తాం. ప్రాజెక్ట్‌ల మరమ్మతులు చేపడతాం. – శ్రీనివాసరావు, వంశధార డీఈ

అక్షరాస్యతతోనే అభివృద్ధి



ఎల్.ఎన్.పేట మండలం బొద్దవలసలో అవగాహన కల్పిస్తున్న బ్యాంకు అధికారులు

హిరమండలం: అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యమని యూనియన్ బ్యాంక్, ఏపీజీబీ మేనేజర్లు మురళీమోహన్, నారాయణ అన్నారు. గురువారం ఎంబరాం పంచాయతీ బొద్దవలసలో ప్రధానమంత్రి జన సురక్ష పథకంలో అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్యాంకుల ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై బీమా పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరికీ బ్యాంకు అకౌంట్లు ఉండేలా చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాల పరిశీలన

కొత్తూరు: మండలంలోని అడ్డంగి గిరిజన గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంపీపీ సవర సావిత్రి గురువారం పరిశీలించారు. పాఠశాలలో 41 మంది విద్యార్థులున్నారని హెచ్‌ఎం తెలిపారు. ఒకే గదిలో ఐదు తరగతులు నిర్వహించడం వలన విద్యార్థులు ఇబ్బంది పడుతున్నట్లు వివరించారు. వంట గది లేకపోవడంతో వర్షం వస్తే వంట మహిళలు అవస్థలు పడుతున్నారన్నారు. పాఠశాల సమస్యలను డీఈఓ దృష్టికి తసుకువెళ్తానని ఎంపీపీ హామీ ఇచ్చారు.

ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు, ఆర్డీఓ కృష్ణమూర్తి

పాతపట్నం: ఈ నెల 9వ తేదీన పాతపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, టెక్కలి ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గిరిజన నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ ప్రసాదరావు, ఎంపీడీఓ చంద్రకుమారి, డిప్యూటీ ఎంపీడీఓ వి.రవీంద్ర ప్రసాద్, గిరిజన నాయకులు వాబ యోగి, శ్రీనివాసరావు, దినకరరావు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

గి'రాఖీ'..



ఈ చిత్రం పాతపట్నం మార్కెట్‌లో విక్రయిస్తున్న రాఖీలు. అక్కాతమ్ముళ్లు, అన్నాచెల్లెళ్ల మధ్య ఆత్మీయ బంధానికి ప్రతీకగా శ్రావణ మాసంలో పౌర్ణమి రోజు నిర్వహించే వేడుకే రక్షాబంధన్. స్థానికంగా ఉన్న వారితోపాటు సుదూరప్రాంతాల్లో ఉన్న సోదరులకు రాఖీ కట్టేందుకు అక్కాచెల్లెళ్లు ఎంతో ఉత్సాహం చూపుతారు. ఈ నేపథ్యంలో రాఖీల విక్రయాలు జోరందుకున్నాయి. ఈ నెల 9వ తేదీన జరిగే పండగ కోసం మార్కెట్‌లో విభిన్న రాఖీలు ఆకట్టుకుంటున్నాయి. ఆన్‌లైన్‌లో సైతం విక్రయాలు బాగానే జరుగుతున్నాయి. ముఖ్యంగా స్పెషల్ లైట్స్, స్ప్రింగ్ రాఖీ, డోరామెన్, చోటా భీమ్, స్టాన్ రాఖీ, ముత్యాలు, నూలు, గంధం చెక్క, వెండితో రాఖీలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. పాతపట్నం మార్కెట్‌లో ఒక్కో రాఖీ రూ.5 నుంచి రూ.800 వరకు విక్రయిస్తున్నారు. – పాతపట్నం

ఇలా ఉంటే వ్యాధులు రావా?



ఎల్.ఎన్.పేట మండలంలోని డొంకలబడవంజలో పారిశుద్ధ్యం దారుణంగా తయారైంది. మురుగు నీటి కాలువల నుంచి నీరు బయటకు వచ్చి రహదారులపై ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. నిత్యం దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నారు. సాయంత్రం 5 గంటలు దాటితే దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. గతకొద్ది రోజులుగా కాలువల నిర్వహణ చేపట్టడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. గురువారం మహిళలు నిరసన తెలిపారు. తక్షణం పారిశుద్ధ్య పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. – హిరమండలం

మార్కెట్‌కు శ్రావణ శోభ



పాతపట్నం: పాతపట్నం మార్కెట్‌లో పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న భక్తులు

శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని మార్కెట్లన్నీ గురువారం కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. పండ్లు, పూజా సామగ్రికి డిమాండ్ పెరిగింది. బంగారం, వస్త్ర దుకాణాలు కొనుగోలుదారులతో నిండిపోయాయి. శ్రావణ పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం ఈ వ్రతాన్ని నిర్వహించడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. – సాక్షి నెట్‌వర్క్



హిరమండలం: మార్కెట్‌లో పండ్లను కొనుగోలు చేస్తున్న మహిళలు



నరసన్నపేట: కాలేజీ రోడ్డు పండ్లు, పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు

రీ సర్వే వేగవంతం చేయాలి

కొత్తూరు: భూముల రీ సర్వే వేగవంతం చేయాలని టెక్కలి ఆర్డీఓ కృష్ణమూర్తి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం సందర్శించారు. వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. భూముల హద్దులు గుర్తించాలన్నారు. జాయింట్ పట్టాలను విడదీసి రైతులకు న్యాయం చేయాలన్నారు. ఇంతవరకు రీ సర్వే చేసిన గ్రామాల్లో తప్పిదాలు ఉంటే సరి చేయాలన్నారు. కల్లెమ్మ రెవెన్యూ గ్రామంలో తప్పిదాలు ఎక్కువ ఉన్నట్లు ఫిర్యాదులు గతంలో వచ్చాయని, రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ బాలకృష్ణ, మండల సర్వేయర్ గవరయ్య, అధికారులు పాల్గొన్నారు.



మెళియాపుట్టి: భరణికోటలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

'మోసానికి మారుపేరు చంద్రబాబు'



పొందూరు: తండ్యాంలో క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న చింతాడ రవికుమార్, నాయకులు

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను సీఎం చంద్రబాబు మోసం చేశారని, ప్రజల కష్టాలు ఈ ప్రభుత్వానికి పట్టవని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్, పార్టీ నాయకులు అన్నారు. మెళియాపుట్టి మండలంలోని భరణికోట గిరిజన గ్రామంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని రెడ్డి శాంతి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. సర్పంచ్ నీలమ్మ, పార్టీ మండల కన్వీనర్ పోలాకి జయముని రావు, నాయకులు ఉర్లాన బాలరాజు, బైపోతు ఉదయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు. పొందూరు మండలంలోని తండ్యాం, మలకాం, దళ్లిపేట పంచాయతీల్లో పార్టీ మండల అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన రికాలింగ్ మ్యానిఫెస్టో కార్యక్రమానికి చింతాడ రవికుమార్ హాజరయ్యారు. కిల్లాన సూర్యారావు, వడగ మోహన్, జాడ అప్పలనాయుడు, గూనాన కృష్ణ, గాడు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు. బూర్జ మండలంలోని కంట్లాం, అయ్యవారిపేట (టీడీఆర్ రాజుపేట) గ్రామాల్లో పార్టీ మండల నాయకులు, సర్పంచ్ సూర ఉదయకుమార్, జెడ్పీటీసీ బెజ్జిపురం రామారావు, మండల ప్రత్యేక ఆహ్వానితులు కర్నేన నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ కరణం కృష్ణమూర్తినాయుడు, మాజీ ఏఎంసీ గుమ్మడి రాంబాబు ఆధ్వర్యంలో, కొత్తూరు మండలంలోని అడ్డంగి గిరిజన గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు గండివలస ఆనందరావు, ఎంపీపీ సవర సావిత్రి, ఎంపీటీసీ సవర సుశీక ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి కూటమి మోసాలను వివరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



బూర్జ: అయ్యవారిపేటలో క్యూ ఆర్ కోడ్‌ను చూపిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కొత్తూరు: అడ్డంగి గిరిజన గ్రామంలో క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చంద్రబాబుది అరాచక పాలన



కేవీజీ సత్యనారాయణ

సరుబుజ్జిలి: రాష్ట్రంలో అరాచకపాలనకు సీఎం చంద్రబాబు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నారని వైఎస్సార్‌సీపీ విజయనగరం జిల్లా పార్లమెంటర్ పరిశీలకుడు, రాష్ట్ర కార్యదర్శి కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలో గురువారం విలేకర్లతో మాట్లాడారు. పార్టీ ఎమ్మెల్సీ, బీసీ నేత రమేష్‌చంద్ర యాదవ్‌పై దాడిచేసి, తిరిగి కేసులు పెట్టడం తగదన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగడుతున్న నేతలనే లక్ష్యంగా చేసుకొని దాడులు చేసి, అక్రమ కేసులు పెట్టి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయాలని చూస్తున్నారన్నారు. తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమకు ధైర్యమన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో పులివెందుల రూరల్ జెడ్పీటీసీ ఎన్నిక నిర్వహిస్తే ఓటమి తప్పదని, ప్రజల్లో భయాందోళనలు సృష్టించేందుకే టీడీపీ నాయకులు దాడులకు తెగబడుతున్నారని ఆరోపించారు. అధికారులు, కూటమి నేతలు కుమ్మక్కై రైతులకు అందాల్సిన ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని విమర్శించారు. అన్నదాతలకు ఎరువులు అందించడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రైతు సేవా కేంద్రాల్లో ఎరువుల కోసం రైతన్నలు పడిగాపులు కాస్తున్నా, అధికారులు ఎరువుల పంపిణీలో పూర్తిగా చేతులు ఎత్తేశారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వ విధానాల్లో మార్పురాకపోతే, తమ పార్టీ తరఫున పోరాటాలు చేస్తామన్నారు. పలువురు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పరామర్శ..



సర్పంచ్ నీలమ్మ కుటుంబాన్ని పరామర్శిస్తున్న రెడ్డి శాంతి

మెళియాపుట్టి: కార్యకర్తలకు అండగా ఉంటానని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని భరణికోట సర్పంచ్ సవర నీలమ్మ అత్త, సవర రంగారావు తల్లి చంద్రమ్మ ఇటీవల మృతి చెందారు. గురువారం ఆ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పార్టీ మండల కన్వీనర్ పోలాకి జయముని రావు, సీనియర్ నాయకులు ఉర్లాన బాలరాజు, బైపోతు ఉదయ్‌కుమార్, పల్లి యోగి, అలికాన మాధవరావు, సవర సుభాష్, తదితరులు ఉన్నారు.